హైదరాబాద్ వార్త



# ఖిత్వ చెరువు కబ్జాలపై... హైడ్రా బుల్డోజర్

**-చెరువును ఆక్రమించిన లక్ష్మీశ్రీనివాస కన్స్ట్రక్షన్స్**
**-ఎఫ్‌టిఎల్, బఫర్‌లో విల్లాలు నిర్మించినట్లు నిర్ధారణ**
**-ఆదివారం ఉదయాన్నే కూల్చివేతలు ప్రారంభం..ఆక్రమణలు నేలమట్టం..**
**-నాలుగేళ్ళుగా ఏంచేశారు అంటూ బాధితుల ఆవేదన**
**-సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి : బాధితులు**



ఎఫ్‌టిఎల్‌లోని ప్రహారీని కూల్చివేస్తున్న దృశ్యం



కూల్చివేతల సందర్భంగా మోహరించిన పోలీసులు బలగాలు

**దుండిగల్, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట ఖత్వ చెరువు ఆక్రమణలపై హైడ్రా కొరడా ఝుళిపించింది. చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లు ఆక్రమించి నిర్మించిన విల్లాలను హైడ్రా బుల్డోజర్లు నేలమట్టం చేశాయి. అదివారం ఉదయాన్నే భారీ బందోబస్తు మధ్య ప్రారంభమైన కూల్చివేతలు రాత్రి వరకు కొనసాగాయి. ఎటువంటి ఆటంకం కలుగకుండా ప్రణాళికబద్దంగా కూల్చివేతలను చేపట్టారు. భారీ బుల్డోజర్ల సహాయంతో ఆక్రమణలను నేలమట్టం చేశారు. వివరాల్లోకి వెళితే మల్లంపేటలోని సర్వేనంబర్ 170/3,170/4,170/5లలో శ్రీలక్ష్మీశ్రీనివాస కన్స్ట్రక్షన్స్ అనే రియల్ సంస్థ విల్లాల నిర్మాణం చేపట్టింది. అయితే 170/4లోని ఖత్వ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ ఆక్రమించి విల్లాలు నిర్మాణం చేపట్టారని నిర్మాణాలు జరుగుతున్న సమయంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో రెవిన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ ఆక్రమించినట్లు నిర్ధారించినప్పటికి సదరు విల్లాలపై చర్యలు తీసుకోవడంలో ఆయా విభాగాల విఫలమైయ్యాయి. కాగా ఇటీవల ఈవిషయమై హైడ్రాకు ఫిర్యాదులందడంతో సంబంధితశాఖ అధికారులతో కలిసి హైడ్రా బృందం పరిశీలించింది. చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్‌లో 22విల్లాలు ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో అదివారం భారీ బుల్డోజర్లతో కూల్చివేతలు చేపట్టి నేలమట్టం చేశారు.

**వివాదాల విల్లాలు...**

శ్రీలక్ష్మీశ్రీనివాస కన్స్ట్రక్షన్స్ అనే రియల్ సంస్థ 2018లో మల్లంపేట పరిధి సర్వేనంబర్ 170/3,170/4,170/5లలోని 15ఎకరాల స్థలంలో ఇండిపెండెంట్ విల్లాల నిర్మాణం చేపట్టింది. ఒక్కో ఫేజ్ చొప్పున నిర్మాణాలు చేస్తూ క్రయవిక్రయాలు ఆరంభించారు. 260 విల్లాలు పంచాయతీ అనుమతులతో, 65విల్లాలు హెచ్‌ఎండిఏ అనుమతులతో చేపట్టారు. అయితే అడ్డదారిలో అనుమతులు పొంది నిర్మాణాలు చేపడుతున్నట్లు స్థానికుల నుండి కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ ఆదేశానుసారం 2021లో రెవిన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ విభాగాలు సంయక్తంగా సందర్శించారు. ఖత్వ చెరువు ఎఫ్‌టిఎల్ 16గుంటలు, బఫర్‌జోన్ 1ఎకరం 14గుంటలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు నిర్ధారించారు. అదే విధంగా అనుమతుల్లేకుండా 260 విల్లాలను నిర్మించినట్లు గుర్తించి సీజ్ చేశారు. నిర్మాణ సంస్థ నిర్వాహకురాలు గుర్రం విజయలక్ష్మీపై ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ అధికారులు దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రిజిస్ట్రేషన్లు చేయవద్దంటూ సబ్‌రిజిస్ట్రార్‌కు, విద్యుత్ సరఫరా చేయవద్దంటూ విద్యుత్అధికారులకు లేఖలు రాశారు. దీంతో రియల్ సంస్థ కోర్టుకు వెళ్ళడం అధికారగణం ఎటువంటి చర్యలు చేపట్టకుండా ఇన్నాళ్ళు మౌనం వహించారు. ఆది నుండి వివాదాల నడుమ కొనసాగిన విల్లాల నిర్మాణాలు పూర్తి చేయడం, కొనుగోలుదారులకు కట్టబెట్టడం అయింది. అన్ని విభాగాల అధికారులు కలిసికట్టుగా ఖత్వ చెరువు స్థలం రియల్‌సంస్థకు కట్టబెట్టినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

**నాలుగేళ్ళుగా ఏంచేశారు...సహాకరించిన అధికారులపై చర్యలు చేపట్టండి : బాధితులు**

ఖత్వ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్లో 22 విల్లాలను నిర్మించినట్లు గుర్తించిన హైడ్రా అధికారులు అదివారం కూల్చివేతలు ప్రారంభించారు. ఈక్రమంలో బాధితులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. మేము లోన్లు తీసుకొని కొనుగోలు చేశాము. ఒక్కో విల్లా కోటి రూపాయల పైమాటే. రేండేళ్ళుగా ఇక్కడే ఉంటున్నాము. ఇప్పుడు వచ్చి ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్లు అని నేలమట్టం చేస్తాము అనడం సరికాదు. చెరువుల పునరుద్దరణ మంచిదే మేము స్వాగతిస్తున్నాము. ఆక్రమణలను తొలగిస్తున్న హైడ్రాకు అభినందనలు తెలియజేస్తూ మా ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్లో అనమతులు ఏలా ఇచ్చారు. సబ్‌రిజిస్ట్రార్ ఏలా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. నాలుగేళ్ళ క్రితం వచ్చిన అధికారులు ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ల హద్దులు ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారు. 15ఎకరాలు కొనుగోలు చేశామన్న సంస్థ నేడు 18 ఎకరాల పైచిలుకు స్థలంలో నిర్మాణాలు ఎలా చేపట్టింది. పూర్తి స్థాయి సర్వే ఎందుకు చేయలేకపోతున్నారు. నిర్మాణాలు జరుగుతున్నప్పుడే అడ్డుకోవాల్సింది. ఆక్రమణలు, అక్రమాలు అని తెలిసి ఆయా విభాగాలు శ్రీలక్ష్మీశ్రీనివాస కన్స్ట్రక్షన్స్ నిర్వాహకురాలైన గుర్రం విజయలక్ష్మీకి సహకరించారు. వారం రోజుల కిందట సైతం మూడు రిజిస్ట్రేషన్లు జరిగాయి. అధికారులు, నిర్వాహకురాలు బాగానే ఉన్నారు. లోన్లు తీసుకొని కొనుగోలు చేసిన మేము మోసపోయామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

హైడ్రా కమీషనర్ ప్రత్యేక చొరవ తీసుకొని శ్రీలక్ష్మీశ్రీనివాస కన్స్ట్రక్షన్స్ సంస్థ చేపట్టిన ఆక్రమణలు, అక్రమాలకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# జంట జలాశయాల గేట్లు ఎత్తిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**- బడాబాబుల ఫాంహౌస్‌లలోకి నీరు వెళ్లకుండా ముందుగానే గేట్లు ఎత్తారు - లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు**



గట్లకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు.



గేట్ల నుంచి నీటిని మూసీలోకి వదిలిన దృశ్యం

**నార్సింగి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :** హైదరాబాద్ నగర శివారుల్లోని జంట జలాశయాల గేట్లను శనివారం సాయంత్రం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ జల మండలి అధికారులతో కలిసి ఎత్తారు. రెండు జలాశయాలలోకి గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు 8.ఫీట్ల మేర కొత్త నీరు వచ్చి చేరింది. మరో రెండు అడుగులు వస్తే పూర్తి స్థాయి మట్టంకు చేరుకుంటాయి. కానీ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ముందు జాగ్రత్తగా జంట జలాశయాల గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలిపెట్టారు. జలాశయాల పైన ఉన్న బడాబాబుల రిసార్టులు, ఫాంహౌస్‌లలోకి నీరు వచ్చే ప్రమాదం ఉండడంతో ఇలా 2.ఫీట్లు నీరు తక్కువగా ఉన్నప్పుడే గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలిపెట్టారని రాజకీయ నాయకులు, ప్రజలు బాహాటంగానే చర్చించుకున్నారు. ప్రభుత్వాలు మారినా బడాబాబులకు ఇబ్బందులు తలెత్తకుండా జంట జలాశయాల గేట్లు ముందస్తుగా ఎత్తారన్న వాదన వినిపిస్తుంది. అధికారలు మాత్రం బడాబాబుల కోసం కాదు, భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉండడంతోనే 2.ఫీట్ల నీరు తక్కువగా ఉన్నా ముందస్తుగా జలాశయాల గేట్లు ఎత్తడం జరిగిందని సంజాయిషీ ఇచ్చుకుంటున్నారు. ఎందుకు గేట్లు ఎత్తారో... లోగుట్టు అంతా స్థానిక ప్రజలకు ఎరుకే. లోతట్టు ప్రాంతాలైన గండిపేట, నార్సింగి, మంచిరేవుల, ఇబ్రహీంభాగ్, హిమాయత్ సాగర్, కిస్మత్‌పూర్, అత్తాపూర్, హైదర్‌గూడ, లంగర్‌హౌస్, కార్వాన్ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

గండిపేట జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1790 అడుగులు(3.90 టిఎంసిలు) కాగా ప్రస్తుతం 1788అడుగుల నీరుంది. మొత్తం నిండేందుకు మరో 2.అడుగులు తక్కువగా ఉంది. ఇన్‌ఫ్లో 700.వేల క్యూసెక్కులు ఉంది. గండిపేట జలాశయం వద్ద 7,9.గేట్లను ఫీటు ఒక ఈంచు మేర ఎత్తి దిగువన ఉన్న మూసీ నదిలోకి 220.క్యూసెక్కుల వరద నీటిని వదిలి పెట్టారు. అలాగే హిమాయత్ సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1763.50.అడుగులు కాగా ప్రస్తుతం 1761.80అడుగుల నీరుంది. మరో 2.అడుగుల నీరు వస్తేనే నిండుతుంది. ఈ జలాశయంలోకి 1200క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, ఇక్కడ ఒక గేటు, ఒక ఫీటు ఎత్తి 330.క్యూసెక్కుల నీటిని ఈసీ నదిలోకి వదిలి పెడుతున్నారు.

ఈ గేట్లు ఎత్తే కార్యక్రమంలో ముదిరాజ్ కోఆపరేటివ్ కార్పోరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పిపిసి అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కస్తూరి నరేందర్ ముదిరాజ్, సీనియర్ నేతలు పి.చంద్రశేఖర్‌రెడ్డి, టి.మల్లేష్ ముదిరాజ్,ఆర్.నర్సిహ్మ, జల మండలి డైరెక్టర్ సుదర్శన్, జీఎం డేవిడ్ రాజ్, డిజిఎంలు నరహరి, గోవింద్‌గౌడ్, మేనేజర్ కాశీనాథ్, రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, నార్సింగి మున్సిపల్ కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి, చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్, మాజీ సర్పంచ్‌లు గండయ్య ముదిరాజ్, కట్ట అశోక్ కుమార్, ప్రవీణ్ యాదవ్, నాయకులు అశోక్ యాదవ్, పి.కృష్ణారెడ్డి, వేణుగౌడ్, రాము, దొబ్బ లక్ష్మణ్, పొన్న రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే హిమాయత్ సాగర్ వద్ద మేయర్ లతా ప్రేమ్‌గౌడ్, కమీషనర్ శరత్‌చంద్ర, కార్పోరేటర్లు రాము, సాగర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సిటీ కొత్వాల్‌గా మరోసారి సి.వి ఆనంద్

**-హైదరాబాద్ పోలీసు విభాగంలో సుధీర్ఘ అనుబంధం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:** హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా సి.వి ఆనంద్ మరోసారి నియమితులయ్యారు. ఇంతకు ముందు ఆయన రెండేళ్ల పాటు కమిషనర్‌గా పనిచేయగా గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అక్టోబర్ నెలలో ఆయనపై బదిలీ వేటు పడింది. దీని తరువాత ఆయనను ఎసిబి డిజిగా నియమించారు. గత పది నెలలుగా ఆయన ఎసిబి డిజిగా వున్నారు. కాగా గణేష్ చవితి వేళ ఆనంద్‌ను తిరిగి సిటీ కొత్వాల్‌గా నియమిస్తూ సర్కారు ఆదేశాలు జారీ చేసింది. సిటీ పోలీసు విభాగంతో ఆనంద్‌కు సుధీర్ఘ అనుబంధం వుంది. ఉమ్మడి తూర్పు మండల డిసిపిగా సెంట్రల్ జోన్ డిసిపిగా పనిచేసిన ఆయన ఆ తరువాత ట్రాఫిక్ అదనపు పోలీసు కమిషనర్‌గా పనిచేసి తనదైన మార్క్‌ను చూపారు. దీని తరువాత ఆయన కొంతకాలం కేంద్ర సర్వీసుల్లో వుండి తిరిగి వచ్చిన తరువాత హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా నియమితులయ్యారు. ఇంతకు ముందు కమిషనర్‌గా పనిచేసిన సమయంలో మాదకద్రవ్యాల స్మగ్లర్ల ఏరివేతకు అనేక ప్రత్యేక ఆపరేషన్లు చేబట్టారు. గోవాలోని డ్రగ్స్ ఆడ్డాలను రట్టుచేసి అక్కడ వున్న అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లర్లను అరెస్టు చేశారు. గోవాలో దశాబ్దాలుగా డ్రగ్స్ దందాలు సాగించిన అనేక మంది స్మగ్లర్లు అప్పట్లో పట్టుబడ్డారు. బెంగళూరు కేంద్రంగా పనిచేసిన పలు డ్రగ్స్ రాకెట్లను కూడా ఆయన చేధించారు. హైదరాబాద్ కొత్వాల్‌గా పనిచేయకముందు ఆనంద్ ఉమ్మడి సైబరాబాద్ పోలీసు కమిషనర్‌గా కూడా మూడేళ్లకు పైగా పనిచేసి మంచి ఫలితాలను సాధించారు. రాష్ట్రంలో నేరగాళ్ల ఏరివేతకు అమలవుతున్న కార్డన్ సర్చ్ ఆనంద్ హయాంలో తొలిసారిగా అమలవడం విశేషం. అప్పట్లో సైబరాబాద్‌లో కార్డన్ సర్చ్‌లో భాగంగా పహాడిషరీఫ్‌లోని స్నేక్ గ్యాంగ్‌తో పాటు పదుల సంఖ్యలో నేరగాళ్లు పట్టుబడగా ఇందులో అనేక మందికి జీవిత ఖైదుతో పాటు కఠిన కారాగార శిక్షలు పడ్డాయి. వీరంతా ప్రస్తుతం చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్లలో మగ్గుతున్నారు. నగరంలో గణేష్ ఉత్సవాల వేళ సిటీ పోలీసు బాస్‌గా తిరిగి ఆనంద్‌ను సర్కారు నియమించింది. కాగా ఆనంద్ సోమవారం నాడు బాధ్యతలు చేబట్టనున్నారు.





# ఖైరతాబాద్ మహాగణపతి దర్శనానికి పోటెత్తిన భక్తులు

**హైదరాబాద్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** భాగ్యనగరంలో వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.వీధి వీధుల్లో గణపతి బప్ప మోరియా అంటూ నినాదాలు మారు మోగాయి. ఖైరతాబాద్‌లో కొలువుదీరిన "శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతి"ని దర్శిం చుకునేందుకు భక్తులు బారులు తీరారు. 70 ఏండ్ల ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రస్థానంలో తొలిసారి 70 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పైన మట్టి విగ్రహాన్ని ప్రతిష్టించారు. స్వామి వారికి రెండు వైపుల అయోధ్య శ్రీబలరాముడు, రాహు, కేతులతో పాటు శ్రీ లక్ష్మీ శ్రీనివాసుడు, పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలు భక్తులకు కనువిందు చేస్తున్నాయి. కాగా, ఖైరతాబాద్ మహాగణపతిని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సిఎం రేవంత్‌రెడ్డిలు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం అర్చకులు వారిని ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఖైరతాబాద్ గణేషుడిని దర్శించుకున్నవారిలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ తదితరులు ఉన్నారు. నవరాత్రోత్సవాలకు ఉత్సవ కమిటీతో పాటు పోలీసు శాఖ, జిహెచ్‌ఎంసి సకల ఏర్పాట్లు కల్పించాయి.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

# చుట్టూ కబ్జాలతో రంగ్‌లాల్ కుంట ఉనికి ప్రశ్నార్థకం

**-ఐటి కారిడార్ రంగ్‌లాల్ కుంటను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్**
**-చెరువు శిఖం స్థలాన్ని ఆక్రమించిన జయభేరి సంస్థకు నోటీసులు**
**-15రోజుల్లో తొలగించకపోతే తామే కూల్చివేస్తామని హెచ్చరిక**



ఐటి కారిడార్ నడిబొడ్డున ఉన్న రంగ్‌లాల్ కుంట

**గచ్చిబౌలి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త** అధికారుల అలసత్వం కారణంగా శేరిలింగంపల్లికి వరంగావున్న చెరువులు ఆక్రమణల చెరలో చిక్కి శల్యమవుతున్నాయి. కబ్జాదారుల పథక రచనకు అధికారగణం అచేతనంగా మారుతుండడంతో అమూల్యమైన జలవనరులు శాశ్వతంగా సమాధవుతున్నాయి. ఎప్పటికప్పుడు ఆక్రమణలను తొలగించి చెరువులను పునరుద్దరించడంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా విఫలమవుతన్న ఫలితంగా గతంలో ఎంతో అందంగావున్న చెరువులు నేడు అవసాన దశకు చేరాయి.ప్రస్తుతం హైడ్రా రాకతో చెరువులకు పునరుజ్జీవం కలుగుతుందని ప్రజలు భావిస్తున్నారు. తాజాగా హైడ్రా కమీషనర్ ఎవి. రంగనాథ్ రంగ్‌లాల్ కుంటను పరిశీలించడంతో ఐటి కారిడార్ వాసుల్లో ఆశలు చిగురించాయి. చెరువు చుట్టూ కబ్జాలు, చెరువు మధ్యలో రహదారితో ఉనికి కోల్పోయి అవసాన దశకు చేరు కున్న రంగ్‌లాల్ కుంటను హైడ్రా కమీషనర్ రంగ నాథ్ పరిశీలించి, కబ్జాలపై చర్యలకు దిగారు. చెరువు బఫర్ జోన్‌ను ఆక్రమించిన జయభేరి సంస్థకు నోటీసులు జారీ చేశారు. 15రోజుల్లో ఆక్రమణలను తొలగించకపోతే తామే కూల్చివేస్తామని హెచ్చరించారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని నానక్‌రాంగూడ సర్వే నెంబరు 106లో 2.28 ఎకరాల్లో రంగ్‌లాల్ కుంట ఉంది. ఎఫ్‌టిఎల్ ను కలుపుకొని చెరువు 5.36ఎకరాల్లో విస్తరించి ఉంది. చెరువు చుట్టూ విస్తరించి ఉన్న గచ్చిబౌలి ఐటి కారిడార్ ఈ చెరువుకు శాపంగా మారింది. ఐటి కారిడార్ నడిబొడ్డున ఉన్న ఈ చెరువుపై ఎన్నో ఏళ్లుగా కబ్జాదారుల కన్నుఉంది. గతంలో ఈ ప్రాంతంలోని పంటపొలాలకు సాగునీటిని అందించిన ఈ చెరువు నేడు ఐటి కారిడార్‌లోని అద్దాల మేడల భూగర్భ జలాలను కాపాడుతుంది. చెరువు చుట్టూ వెలసిన పలు నిర్మాణ సంస్థలు, పలువురు బడా బాబులు ఈ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ పరిధిలో మట్టిని నింపి ఆక్రమించారు. చుట్టూ భవనాలు వెలువడంతో చెరువు లోపలికి మురుగు నీరు తప్పితే వరద నీరు వచ్చే వీలు లేకుండా పోగా, వచ్చిన కొద్దిపాటి వరద నీరు సైతం బయటకు వెళ్లే అలుగు, తూము నాళాలు సైతం ఆక్రమణకు గురయ్యాయి. ఓవైపు ఆక్రమణలతో కుంచించుకుపోయిన చెరువు మధ్యలో నుంచి ప్రభుత్వం రహదారి నిర్మాణం చేపట్టడంతో రంగ్‌లాల్ కుంట విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయి నీటి మడుగును తలపిస్తుంది.

**పరిశీలించిన రంగనాథ్..జయభేరికి నోటీసులు...**

రంగ్‌లాల్ కుంట చెరువు ఆక్రమణపై పిర్యాదులు అందుకున్న హైడ్రా కమీషనర్ ఏవి.రంగనాథ్ శుక్రవారం చెరువును పరిశీలించారు. రంగ్‌లాల్ కుంట ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ విస్తీర్ణాన్ని పరిశీలించడంతో పాటు రికార్డుల ఆధారంగా వివరాలు సేకరించారు. రంగ్‌లాల్ కుంటకు ఆనుకొని ఉన్న జయభేరి నిర్మాణ సంస్థ చెరువు శిఖం స్థలంలో మట్టిని నింపి, రేకులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆక్రమించినట్లు గుర్తించారు. ఈమేరకు జయభేరి నిర్మాణ సంస్థకు హైడ్రా అధికారులు నోటీసులు జారీ చేశారు. 15రోజుల్లో ఆక్రమించిన స్థలంలో ఉన్న కట్టడాలను తొలగించాలని, లేనిపక్షంలో హైడ్రా కూల్చివేస్తుందని తేల్చి చెప్పారు. జయభేరితో పాటు చెరువుకు మరోవైపు ఉన్న శిఖం స్థలం, అలుగు నాలాల ఆక్రమణపై సైతం హైడ్రా అధికారులు వివరాలు సేకరించారు. త్వరలోనే సదరు నిర్మాణాలను కూల్చివేయనున్నట్లు సమాచారం. కాగా హైడ్రా నోటీసులపై స్పందించిన జయభేరి అధినేత మురళీమోహన్ చెరువు శిఖం స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను రెండు రోజుల్లో తామే కూల్చివేస్తామని ప్రకటించారు.



చెరువు శిఖం స్థలాన్ని ఆక్రమించి జయభేరి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్



చెరువుకు మరోవైపు చెరువు కట్ట, శిఖం స్థలాన్ని ఆక్రమించి వెలిసిన నిర్మాణాలు

# ఆర్థిక ఇబ్బందులతో ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆత్మహత్య

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ రైల్ పట్టాల కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అంబర్‌పేట్‌లో నివాసం ఉంటున్న నరిసింహ్మారాజు 2009 (బ్యాచ్) గోపాలపురం ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో ఆదివారం ఘట్‌కేసర్‌లోని పోల్ నెం 216 వద్ద ట్రాఫిక్ కానిస్టేబుల్ నరిసింహ్మారాజు రైల్ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు.

# షార్ట్ సర్క్యూట్‌తో గణేష్ మండపం దగ్ధం



మండపంలో మంటలు చెలరేగుతున్న దృశ్యం

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** గణేష్ ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన గణేష్ మండపం అగ్నికి ఆహుతయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో వినాయక మండపం పూర్తిగా కాలిపోయింది. ఈ సంఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గడ్డిఅన్నారం డివిజన్ దిల్‌సుఖ్‌నగర్ పిఅండ్‌టి కాలనీలో వినాయక ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన వినాయక మండపంలో పండగపూట శనివారం రాత్రి అగ్ని ప్రమాదం సంబవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మండపం, సామగ్రి మొత్తం కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ మెయిన్ స్విచ్ ఆన్ చేసే సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లుగా స్థానికులు తెలుపడం జరిగింది. మంటలు ఒక్కసారిగా ఎగసిపడడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

## వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



దండుగుల స్వామిని అభినందిస్తున్న సంఘం సభ్యులు

**నిజాంపేట్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త**

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని తెలంగాణ వడ్డెర సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చుటకు అలాగే వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ డిక్లేర్ చేసిన 500 కోట్లు నిధులు విడుదల చేయాలని, ప్రమాదవశాత్తు మరణించిన వడ్డెర కార్మికులకు 25లక్షలు ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. అనంతరం గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్‌గా తెలంగాణ ఉద్యమకారుడు దండుగుల స్వామిని ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, గౌరవాధ్యక్షులు ముదంగుల గదయ్య, స్టేట్ యూత్ ప్రెసిడెంట్ కొమ్మురాజుల శేఖర్, సెక్రటరీ రమేష్, రామకృష్ణ, శ్రీనివాస్, నవీన్, వెంకటేష్, అఖిల్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు అపోలో కోటి సాయం..

**పంజగుట్ట, సెప్టెంబర్ 8 (ప్రభాతవార్త):**

తెలంగాణాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. ఎన్నో కుటుంబాలు వరదల తాకిడికి నిరాశ్రయులయ్యారు. వీరి సహాయార్థం జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రి తమవంతు సాయంగా కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించింది. ఈ విరాళాన్ని తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సంగీతారెడ్డి మాట్లాడుతూ సవాళ్ళ సమయంలో ప్రజలకు అండగా ఉంటామని, పునర్నిర్మాణ ప్రయత్నాలకు సహకరించేందుకు కట్టుబడి ఉంటామన్నారు

## వినాయకుడికి ప్రత్యేక పూజలు



పూజలు చేసిన రాజ్యసభ్యులు కె. లక్ష్మన్, చంద్రశేఖర్, బిజెపి నాయకులు డి.గోపాల్‌జీ

**గోషామహల్, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** వినాయక ఉత్సవాలను పురస్కరించుకుని గోషా మహల్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలల్లో నెలకొలి ్పన వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. నాంపల్లిలోని తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో వినాయక ప్రతిమకు రాజ్యసభ సభ్యులు కె. లక్ష్మన్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, తెలంగాణ బిజెపి కార్యాలయ ఇన్‌చార్జ్ డి.గోపాల్‌జీ, ఆనంద్, మురళీధర్‌లు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో పూజలు చేయాలన్నారు. ఈ కార ్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## బి.సి కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు ఘన సన్మానం



బి.సి కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను సన్మానిస్తున్న కార్వాన్ కాంగ్రెస్ నేతలు.

**మెహిదీపట్నం, సెప్టెంబర్ 08, ప్రభాతవార్త :**

బి.సి కమిషన్ చైర్మన్‌గా జి.నిరంజన్ నూతనంగా నియమితులు కావడంతో కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఏ-బ్లాక్ అధ్యక్షులు కూరాకుల కృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జి. నిరంజన్ మాట్లాడుతూ..ప్రజా సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బి.సి కులగణనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బి.సి కులాలలోని అట్టడుగు కులాల అభివృద్ధికి బి.సి కమిషన్ కృషి చేస్తుందన్నారు. సన్మానించిన వారిలో టీపీసీసీ కార్యదర్శి అఫ్సర్ యూసూఫ్ జాహి, జీహెచ్ఎంసీ కార్యదర్శి అబ్దుల్ అహ్మద్‌లు ఉన్నారు.

## టిపిసిసి అధ్యక్షుడికి అభినందనలు వెల్లువ

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ నియమితులైన సందర్భంగా ఆదివారం చెవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, కంటోనె ్మంట్ చెందిన బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ ముప్పిడి గోపాల్, కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ రెడ్డి, క్రిష్ణా రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

## ఆటోడ్రైవర్లకు ఉపాధి అవకాశాలు చూపాలి



మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బొజ్జ రమేష్

**నాచారం, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:**

మహిళల కోసం ప్రభుత్వం ఉచితంగా ఆర్టీసీలో బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్లు ఉపాధికోల్పోయారని వారికి ప్రత్యామ్నయంగా ఉపాధి అవకాశాలు చూపాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు దళిత జనసమితి రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు, కార్మిక విభాగం రాష్ట్ర ఇంచార్జి బొజ్జ రమేష్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బొజ్జరమేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 6లక్షల యాభైవేల మంది ఆటో కార్మికులు ఉన్నారని వీరంత ఉచిత బస్సు ప్రయాణం వల్ల జీవనోపాది కోల్పోయి వారు రోడ్డున పడ్డారని వారిని ప్రభుత్వం ఆదోకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు చెప్పారు. ఆటోలకు ఈవీఎంలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి వారికి నెలకు. రూ.10వేలు ఇచ్చి ఆదుకోవాలని, ఉచిత వైద్యం, వారి పిల్లలకు ఉచిత విద్య, వైద్యం అందజేసే విధంగా చూడాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో డిజెఎస్ మైనార్టీ సెల్ ఇంచార్జి సయ్యద్ మాజీద్, ఇప్పల కుమార్, పులి శ్రీకాంత్, సంజయ్, రవి తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీ వినాయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్



వినాయక చవితి సందర్భంగా ఆదివారం సకుటుంబ సపరివారి సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి



ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ టీటీడీ కళాశాలలో గణపతి పూజలు చేస్తున్న జంపనప్రతాప్ తదితరులు



నేతాజీనగర్‌నగర్‌లో గణనాధునికి తొలిపూజలు చేస్తున్న కాలనీ వాసులు

## వినాయకునికి ప్రత్యేక పూజలు

**న్యూ శ్రీనివాస కాలనీలో..**

**నిజాంపేట్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :** వినాయక చవితి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం న్యూ శ్రీనివాస కాలనీలోని వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారి ఆశీస్సులు ఎప్పుడు ఉండాలని కోరుకోవడం జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంగా శ్రీనివాసరావు, మహేష్ యాదవ్, ప్రకాష్, ఖరీమ్, రాజారెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటేష్ యాదవ్, కమిటీ వారు తదితరులు పాల్గొన్నారు.

**ఓల్డ్ ఎయిర్‌పోర్ట్‌లో**

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం కంటోన్మెంట్ 1వ వార్డు ఓల్డ్ ఎయిర్‌పోర్ట్‌లోని టీటీడి సాంస్కృతిక కళాశాలలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా వాయు నగర్, కంసరి బజార్, మలాని కాలనీ, బాపూజీ నగర్ ప్రాంతాలో ్లని మండపాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు.

**నేతాజీనగర్ కాలనీలో ...**

**శేరిలింగంపల్లి సెప్టెంబర్ 8 ప్రభాతవార్త :** సర్వవిఘ్నాలను తొలగించే గణనాధుని ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా శోభిల్లాలని బీసీ ఐక్య సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, నేతాజీనగర్ కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్‌యాదవ్ ఆకాంక్షించారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నేతాజీనగర్ కాలనీ యూత్ ఆధ్వర్యంలో గణనాధునికి తొలిపూజలు నిర్వహించారు. విగ్రహదాత బోరా సత్యనారాయణ ముదిరాజ్ గణనాధుని ప్రతిష్టించి వినాయకమండపంలో తొలిపూజా కార్యక్రమాలనునిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన బీసీ ఐక్య సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, నేతాజీనగర్ కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ.. వినాయకుని మనస్ఫూర్తిగా కొలుస్తూ తమకున్న పనులకు గల విఘ్నాలను తొలగించమని ప్రార్ధించే ప్రతిఒక్కరూ చల్లగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విగ్రహదాతలు బోరా సత్యనారాయణ ముదిరాజ్, నాగమణి, కాసాని చార్విన్ ముదిరాజ్, బి.పూజ, కిశోర్‌కుమార్, కవిత, సిహెచ్ కృష్ణ, స్వప్న, సంతోశ్, సుమ, అసోసియేషన్ సభ్యులు కే.నరసింహా యాదవ్, ఉపాధ్యక్షులు రాయుడు, రవినాయక్, సత్తెమ్మ, బుజ్జమ్మ, లాల్‌రెడ్డి, మణికంఠ, యాదగిరిసాగర్, దయాకర్, సోమిరెడ్డి, యూత్ ప్రెసిడెంట్ డీజే భవన్, రాజు, లవణ చారి, భేరి చంద్రశేఖర్‌యాదవ్, సాయికిరణ్‌యాదవ్, ఆశోక్, సలీం, బాల్‌రాజ్, కాలనీ పెద్దలు, మహిళ సోదరులు, యువజన నాయకులు పెద్దసంఖ్యలో మహాగణనాధుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**చిక్కడపల్లి సాయిబాబా ఆలయం ఆవరణలో**

**చిక్కడపల్లి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లిలోని శ్రీ షిరిడిసాయిబాబా దేవాలయం ఆవరణంలో ఆలయం నిర్మాణ సమితి సభ్యులు ధర్మరాజ్‌గౌడ్, పెదోళ్ళ గంగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద మాజీ కార్పొరేటర్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వి.శ్రీనివాస్‌రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు నాయిని సాత్విక్‌రెడ్డి, సాయిని సాన్వీరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత శ్రీనివాస్, బిఆర్ఎస్ నేతలు సిరిగిరి శ్యామ్, సంగిశెట్టి రాజు, రాజేశ్, జనార్దన్, అమిత్, సురేశ్, సంతోష్, శ్రీనివాస్, ప్రకాశ్, రు, మట్టపల్లి, వి.ధనుష్‌రెడ్డి, భానుకుముది పాల్గొన్నారు.

**వివేక్‌నగర్‌లో...**

వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో వినాయక చవితి సందర్భంగా వరసిద్ధి వినాయక వ్రతమహోత్సవం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. ఆలయం ఈవో మాచర్ల దేవనాథం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బుగ్గా లక్ష్మీపతిశర్మ, టి.వెంకటాద్రి, క్లర్క్ రాజన్, ప్రశాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

## భక్తితోనే మనిషికి శక్తి ముక్తి : డా. కె.వి.రమణాచారి

**నాంపల్లి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త :**

భక్తి అనేది సమాజంలో ప్రతీఒక్కరికీ ఎంతో అవసరమని, భక్తి ఎంతో గొప్పది.... భక్తివుంటే మనిషికి శక్తి, యుక్తి, ముక్తి వాటికవే వస్తాయన్న తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి భక్తి అనేది దిక్సూచి, ఓదార్పు, శీతలభవనం, ఆత్మీయస్పర్శ, ఆవంబలనం, భక్తి అనేది హృదయానికి ఆనందానికి మధ్య సేతువు.... ఆనందహేతువు అని అభివర్ణించారు. ప్రతీఒక్కరికీ జన్మనిచ్చిన తల్లిదండ్రులు, విద్యను నేర్పే గురువు, వివాహమైన తర్వాత దంపతుల మధ్య భక్తి ఉండాలని చెప్పారు. భకితో చేసే భోజనం ప్రసాదం, నీళ్లుతాగితే తీర్థం, భక్తితో భజిస్తే సేవ, నామస్మరణ చేస్తే జపం, ప్రయాణం చేస్తే తీర్థయాత్ర, మంచిపనిచేస్తే కర్మ, మాట మంత్రమవుతాయని రమణాచారి భక్తి ప్రాధాన్యతను విశదీకరించారు. బండారుపల్లి రామచంద్రరావు రచనలు భక్తి, భక్తావేశపూరితమైనవి అభివర్ణించారు. శ్రీమానస ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో రెడ్ హిల్స్‌లోని డా. కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో డా. పి.లలితవాణి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి, పుష్పలత దంపతులు బండారుపల్లి రామచంద్రరావు రచించిన ఆత్మీయరూప, ఆనందప్రద శ్రీ శ్రీనివాస శరణుమంజరి; ఆప్తరూప, అభయవరద ఏడుకొండల శ్రీ వేంకటేశ్వర శరణుమంజరి గ్రంథాలను గౌరవ అతిథులు బైస దేవదాసు, గుదిబండి వెంకటరెడ్డి, రఘుశ్రీ తదితరులతో కలిసి ఆవిరించి ఈ రెండు గ్రంథాల్లో ఉన్న గేయ కవితలు చక్కగా పాడుకోవచ్చు, స్వామిని సేవించుకోవచ్చునని, సులభ సాధ్యమైనగేయాలను రచించిన రామచంద్రరావును అభినందించారు.



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న రమణాచారి, లత దంపతులు, లలితవాణి, బైసదేవదాసు, రఘుశ్రీ తదితర అతిథులు

## 17న సామూహిక వినాయక నిమ్జనం కొనసాగింపు

**-కార్యాలయంలో పూజలు చేసిన ఎంపి.ఈటల రాజేందర్, ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, ఉత్సవ సమితిప్రతినిధులు**

**గోషామహల్, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:**



ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ఈటల

వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని శనిఇవార ం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సిద్దింబర్‌బజార్‌లోని బహెతి భవన్‌లో వినాయక పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈపూజ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, ఉత్సవ సమితి అధ్యక్షులు జి.రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజవర్దన్‌రెడ్డి, కార్యదర్శి రావినూతల శశిధర్, నర్సింగ్‌పూరియా, మాజీ కార్పొరేటర్ మెట్టువైకుంఠం, శ్రీరామ్‌వ్యాస్, యమన్‌సింగ్, రామరాజు, మహేందర్, గోవింద్‌రాతి సుబాష్‌చందర్‌జీ, ఉత్సవ సమితి ప్రతినిధుల తో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈటెల రాజేందర్ మాట్లాడుతూ హిందువులలో వస్తున్న ఐక్యత, ధర్మ రక్షణ కోసం ఉపయోగపడాలని అందుకై ప్రతి హిందు వు కంకణ బద్దులై పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాలు భారత వైపు చూస్తున్నాయన్నారు. విశ్వనికి విశ్వ గురువుగా భారత దేశం ఉంటుందన్నారు. బోనాల పండుగ నుంచి మొదలుకుని, శ్రావణ మాసం పూజలు, ప్రస్తుతం వినాయక ఉత్సవాలు పండుగలు విశ్వ శాంతి కోసం చేస్తున్నామన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకోవడం సనాతన ధర్మ గొప్పతమన్నారు. ప్రధాన కార్యదర్శి రాజవర్దన్‌రెడ్డి మాటాడుతూ మానవ కళ్యాణ కోసమే సనాతన ధర్మం పాటు పడుతుందన్నారు. వినాయక పూజలను భక్తి శ్రద్దలతో నిర్వహించాలన్నారు. పాశ్చాత్యా టెక్నాలజీకి దూరంగా ఉండాలన్నారు. కార్యదర్శి రవినూతల శశిధర్ మాట్లాడుతూ భాగ్యనగరంలో 45 సంవత్సరాల క్రితం ప్రారంభమైన వినాయక సామూహిక నిమజ్జనంతో నేడు భాగ్యనగర్ వినాయక ఉత్సవాలు ఎంతో పేరు గాంచినట్లు చెప్పారు. ఉత్సవ సమితి నాటి పెద్దలు జి.పుల్లారెడ్డి, అలె నరేంద్ర, పి.రామస్వామి, బద్దం బాల్‌రెడ్డిలతోపాటు ఎందరో ఒక గొప్ప లక్ష్యంతో సామూహిక వినాయక ఉత్సవాలకు నాడు శ్రీకారం చుట్టినట్లు గుర్తు చేశారు. ప్రతి మండపం వద్ద జాతీయ జెండాతోపాటు కాషాయ జెండాను ఎగురవేయాలన్నారు. లక్ష40వేల మండపాల్లో దేశభక్తి, దైవభక్తి పెంపొందించే విధంగా పాటుపడాలన్నారు. ఈనెల 17వ తేదిన వినాయక సాగర్‌లోనే నిమజ్జన కొనసాగుతుందన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పూర్తి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులు కార్పొరేటర్లు శశికళకృష్ణ, లాల్‌సింగ్, మాజీ కార్పొరేటర్ వై.కృష్ణ వందలాదిమంది ఉత్సవ ప్రతినిధులు పాల్గొన్నారు.

## తనిఖీలు ముమ్మరం చేసిన వెస్ట్‌జోన్ డిసిపి

**మండపాల వద్దకు వెళ్ళి నిర్వాహకులకు పలు సూచనలు..**

**పంజగుట్ట, సెప్టెంబర్ 8 (ప్రభాతవార్త):**

గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని నిర్వాహకులకు సూచనలు చేస్తూ పశ్చిమ మండలం డీసీపీ విజయకుమార్ పలు ప్రాంతాలలోని మండపాలను సందర్శించారు. డీసీపీ అటు నిర్వాహకులకు ఇటు స్థానిక పోలీసులకు పలు సూచనలు చేస్తూ ఎలాంటి పరిస్థితుల్లోనూ శాంతిభద్రతలకు విఘాతం కలగడానికి వీలులేదని హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా అనుమానితుల కదలికలపై నిఘా ఉంచాలని ఆయన ప్రత్యేకంగా సూచించారు. శనివారం రాత్రి డీసీపీ విజయకుమార్‌తో పాటు బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకటరెడ్డి, బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ కేఎం రాఘవేంద్ర తదితరులు బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 13 లోని శ్రీరామ్‌నగర్‌లో గణేష్ మండపాల వద్దతనిఖీలు నిర్వహించారు. నిర్వాహకులను పిలిచి తగు సూచనలు జారీ చేశారు. అదేవిధంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మాసాబ్ ట్యాంక్ తదితర పోలీసు స్టేషన్‌ల పరిధిలో ఆయా మండపాల వద్ద పర్యటించి నిర్వాహకులకు ప్రత్యేక సూచనలు చేశారు. నిర్వాహకులతో పాటు పోలీసులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా రాత్రి సమయాలలో గస్తీ పెంచాలని ఆయన కోరారు. రాత్రి సమయాలలో అనుమానితుల కదలికలను గురినతంచి, అనుమానం వచ్చిన వెంటనే కూలంకుషంగా విచారణ చేపట్టాలని ఆయన సూచించారు.

## గణేష్ దేవాలయంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ పూజలు



సికింద్రాబాద్ గణేష్ దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:**

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని 200 సంవత ్సరాల చరిత్ర కలిగిన శ్రీ గణేష్ దేవాలయంలో నిర్వహించిన గణేష్ నవరాత్రి పూజా కార్యక్రమాలను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, మాజీ మంత్రి, మేడ్చెల్ ఎమ్మెల్యే సి.హెచ్.మల్లారెడ్డిలు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలుకగా వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో నందికంటి రవి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బద్రినాథ్ యాదవ్, ముప్పిడి మధుకర్, సి.సంతోష్ యాదవ్, సదానంద్ గౌడ్, బల్వంత్ రెడ్డి, తేజ్‌పాల్, రామొహన్, గౌతమ్, శివ, జూలు పాల్గొన్నారు.

**గణేష్ మహారాజ్ ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి : శ్రీగణేష్**

విఘ్నేశ్వరుడి ఆశీసు ్సలతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని కంటోనె ్మంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత ్సవాలను పురస్కరించుకొని ఆదివారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలో ్ల ప్రతిష్టించిన గణేష్ మండపాలను ఆయన దర్శించి నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. గణేష్ మండపాలకు సిఎం రేవంత్ రెడ్డి ఉచిత విద్యుత్‌ను సరఫర చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## బాలాపూర్ గణేషునికి సబితా ఇంద్రారెడ్డి తొలి పూజలు



బాలాపూర్ గణేషుని తొలి పూజల అనంతరం సబితారెడ్డిని సన్మానించి లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తున్న ఉత్సవ నిర్వాహకులు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:**

గణేష్ నవరాత్రి ఉత్సవాలు, లడ్డూ వేలంలో ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్ గణనాథునికి మాజీ మంత్రి, స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేష్ ఉత్సవ సమితి ఆహ్వానం మేరకు ప్రతి సంవత్సరం జరిగే నవరాత్రి ఉత్సవాల్లో తొలి రోజు హాజరై తొలి పూజ సబితా ఇంద్రారెడ్డి చేస్తుంటారు. అయితే ఈ సంవత ్సరం కూడా ఆమె గణనాథుడి మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజారులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆ తర్వాత ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఉత్సవ కమిటీ వారు ఆమెను సన్మానించి గణేష్ మినీ లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. అదే విధంగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రథమ పౌరురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కూడా గణేషునికి పూజలు చేశారు.

## వినాయకుడికి ఎమ్మెల్యే పూజలు



పూజలు నిర్వహిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:**

వినాయక చవితి సందర్భంగా ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఆలయం ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయం పూర్వ చైర్మన్లు బిఎన్.శ్రీనివాస్‌యాదవ్, ముచ్చకుర్తి ప్రభాకర్, వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం పూర్వ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్, పి.సుధాకర్, బత్తుల కిరణ్‌కుమార్, ఆలయం ఆలయం ప్రధాన అర్చకులు కాశీనాథ్‌శర్మ, జగన్మోనాచార్యులు, గోపాలాచార్యులు, పి.శ్రీధరాచార్యులు, రామాచార్యులు, ఆలయం సిబ్బంది రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రోజుల టిటిడి శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయం

**సైఫాబాద్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** కలియుగ దైవం టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాలు జంటనగరాల భక్తులకు ప్రతి రోజు అందుబాటులో ఉంటాయి. హిమాయత్‌నగర్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో, జూబ్లీహిల్స్‌లోని శ్రీవారి దేవాలయంలో ప్రతి రోజు స్వామివారి లడ్డూ ప్రసాదాల విక్రయం జరుగుతుంది. గతంలో ప్రతి శనివారం మాత్రమే శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయిం జరిగేది. కాని భక్తుల కోరిక మేరకు ప్రతి రోజుల లడ్డూ ప్రసాదాన్ని టిటిడి భక్తులకు విక్రయిస్తున్నది. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శ్రీవారి కృపకు పాత్రులుకావాలి

## గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవం




గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(గోపా) తెలంగాణ రాష్ట్ర శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలోని వివిధ జిల్లాల నుంచి గోపా కమిటీ సభ్యులు, జీవితసభ్యులు పాల్గొన్నారు. అనంతరం నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక ప్రక్రియ ద్వారా రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బండి సాయన్నగౌడ్, ప్రధాన కార్యదర్శిగా జి.వి.శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా మొగిలి రఘునాథ్‌గౌడ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక ప్రక్రియను గోపాల కోర్ కమిటీ సభ్యులఉ డాక్టర్ ఈడా శేషగిరిరావుగౌడ్, పూదరి వెంట్రా జంగౌడ్, డాక్టర్ బి.విజయభాస్కర్‌గౌడ్‌లు అందరి ఆమోదంతో నిర్వహించి నూతన కమిటీని ప్రకటించారు. ఈ సర్వసభ్య సమావేశం ద్వారా జరిగిన ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న జీవిత సభ్యులు, నూతన కమిటీ బాధ్యులకు రాష్ట్ర నూతన కమిటీ ధన్యవాదాలు తెలిపారు.

## సాయుధ పోరాట చరిత్రకు సువర్ణ అక్షరాలు

**సైఫాబాద్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర పుటల్లో సువర్ణ అక్షరాలతో లిఖించబడిందని సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి చెప్పారు. ఈ మహోత్తరమైన పోరాటంతో ఏలాంటి సంబంధం లేని మతోన్మాద శక్తులు నేడు ఈ చరిత్రకు మతం రంగును పులుముతూ హిందూ, ముస్లిం పోరాటంగా చిత్రీకరిస్తున్నారని ఆయన ఆరోపించారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను నాలుగు భాషాల్లో ముద్రించి ప్రచురించిన బుక్లెట్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని వాస్తవికత చరిత్రను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి తెలంగాణను లౌకిక ప్రజాస్వామ్యం వైపు నడిపించాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకు ముందు ఆయన తెలంగాణ సాయుధ పోరాట సేనాని పద్మవిభూషణ్, మాజీ ఎంపి రావి నారాయణరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సభకు సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి అధ్యక్షత వహించారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలో నిరంకుశ నిజాం రాచరిక పాలనలో రజాకార్లు ప్రజలపై సాగించిన దమనకాండకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ దిగ్గజాలు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డిడ, మగ్దూం మొహియుద్దీన్ సారధ్యంలో ప్రజలు బందుకులు పట్టి భుక్తి కోసం, భూమి కోసం, విముక్తి కోసం సాగించిన రణభేరి తెలంగాణ సాయుధ పోరాటమని చెప్పారు. ఈ సభలో జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, సామాజిక శాస్త్రవేత్త కృష్ణప్రసాద్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహ్మా, సీనియర్ నా యకులు డా.బి.వి.విజయలక్ష్మి, ఉజ్జిని రత్నాకర్‌రావు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE V SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.S. No. 388 of 2024**

Between:
**Tirumala Desikan Mythili & others ...Plaintiffs**
And
**Tahsildar & Another ...Defendants**

To,
**All concerned ...Defendant No.2**

Whereas the above named plaintiffs filed a suit for Declaration to declare the plaintiffs as legal heir of deceased Tirumala Vardachary Desikan and the same stands posted to **17-10-2024.**

You are hereby directed to appear on **17-10-2024 at 10:30 AM** either in person or through pleader, else the matter will be heard and decided Ex-parte.

// BY ORDER OF COURT //

**Sd/- Mohammed Aleemullah**
B.Com, LL.B
**Advocate**
D.No. 11-4-892, Chilkalguda, Secunderabad-61.

**IN THE COURT OF THE HON'BLE V ADDL. JUNIOR CIVIL JUDGE, R.R. DISTRICT, AT: L.B. NAGAR**
**O.S.No. 548 of 2024**

Between:
**Kadiyala Ravi Shankar & Another ....Plaintiff**
AND
**The Tahsildar (MRO), Saroor nagar and All Concerned ...Defendant**

To,
**All Concerned (D2)**

Please take notice that the Plaintiffs herein have filed the above suit against the Defendants to declare them as the Legal Heirs of the Deceased Late. **Smt. KADIYALA USHA SREE** in respect of The Hon'bleV Addl. Junior Civil Judge, R.R.District, at L.B.Nagar was pleased to take up the matter and have directed us to publish the said notice against the Defendant No.2 herein. Any concerned authority or office or others having any objection with regard to the above mentioned suit or against the Plaintiffs claim herein are requested to raise the same appearing before the court on the next date of hearing. The next date of hearing is fixed on **23-09-2024 at 10:30 AM.** In the event of your absence, the case will be decided as per law.

(BY THE ORDER OF THE COURT)

**Sd/- B. DIVAKAR**
**M. SRINATH**
**Advocate**
# 3-11-221/3, Sri Shankar Colony, L.B. Nagar, Hyderabad - 074
**Cell: 9533314269**

**IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM II ADDL METROPOLITAN MAGISTRATE COURT, MEDCHAL MALKAJGIRI DISTRICT AT MALKAJGIRI**
**O.S.No.846 of 2024**

Between:-
**Thampula Jaya Sudha & Ors ...Plaintiffs**
And
**1) The Tahsildhar,** Alwal Mandal, Medchal Malkajgiri District
**2) To whosoever it may concern ...Defendants**

Whereas my clients **1) Thampula Jaya Sudha,** W/o: Late T B Ravindra Prasad, Aged about 43 years, Occu: Govt Employee, **2) Thampula Dimple Priya,** D/o: Late T B Ravindra Prasad, Aged about 23 years, Occu: Student, **3) Thampula Susmitha,** D/o: Late T B Ravindra Prasad, Aged about 20 years, Occu: Student, All are R/o: H.No.1-30-742, Shiva Nagar, Near Alphores School, Tirumalgiri, Medchal Malkajgiri Districthas filed the above case for Declaration of legal heir to late T B Ravindra Prasad.

The above case is posted on **20.09.2024.** If anyone has objections in declaring my clients 1) Thampula Jaya Sudha, 2) Thampula Dimple Pirya, and 3) Thampula Susmitha as legal heirs to Late Sri T B Ravindra Prasad, you are hereby requested to appear on **20.09.2024** before Hon'ble II Additional Junior Civil Judge cum II Additional Metropolitan Magistrate Court, Medchal Malkajgiri District at Malakjgiri at 10.30 am., in person or by an Advocate. In failure, the matter will be decided exparte in your absence.

By order of the court.

**Karra V V S N Murthy**
**Advocate**
# 402, 4th Floor, Orion Plaza, Road No.3, Banjara Hills, Hyderabad - 32
**Cell No. 9441670405**
**Email: karraassociates2020@gmail.com**

## శరవేగంగా కమ్యూనిటీ హాల్ పనులు : ఎం. రజితరెడ్డి



**ఉప్పల్, సెప్టెంబర్ 8 (ప్రభాతవార్త) :**

ఉప్పల్‌లోని శాంతినగర్ హరిజన బస్తీలో రూ. 40లక్షలతో చేపడుతున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డితో కలిసి స్లాబు పనులను పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి వస్తే అందరికీ వీలు ఉంటుందని, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల కోసం పాటుపడే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. డివిజన్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి రామకృష్ణ,ఈగ ఆంజనేయులు, అనిల్ కుమార్ ,జనగాం రామకృష్ణ, నాగూర్ బాషా, అన్వర్, ఆల్వాల్ భాస్కర్, రేణుక, కవిత, హరి బాబు రంగుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్ డివిజన్‌లోని గణనాథులను దర్శించుకున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్

**కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి**



**నాచారం, సెప్టెంబర్ 8 (ప్రభాతవార్త) :**

శ్రీ వినాయక చవితి ఉత్సవాలల్లో భాగంగా మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను నిర్వాహకుల ఆహ్వానం మేరకు స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి దర్శించుకుని అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఓల్డ్ మల్లాపూర్, చాణక్యపురి కాలనీ, ఎఫ్ సిఐ రోడ్డులోని వివిధ మండపాల వద్ద పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండపాల నిర్వాహకులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చదువు పట్ల ఆసక్తి పెంచుకోవాలి : సుదర్శన్ రెడ్డి




**ఎల్బీనగర్, సెప్టెంబర్ 8 (ప్రభాతవార్త) :**

పోటీ ప్రపంచంలో అన్ని విషయాలపై అవగాహన పెంచు కోవడంతో పాటు చదువు పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని శివాని మహిళా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ వేధిరే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. కొత్తపేటలోని శివాని మహిళా కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో నాణ్యతతో కూడిన ఆధునిక విద్యను అందజేస్తున్నామన్నారు. విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందించడం వల్లనే క్యాంపస్ ప్లేస్మెంట్ ల ఉద్యోగాలు సాధించడంతోపాటు జీవితంలో త్వరగా స్థిరపడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. అనంతరం అధ్యాపకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, సాంబశివరావు, ప్రిన్సిపల్ అనిత కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మహేష్ కుమార్ నేతృత్వంలో కాంగ్రెస్ బలోపేతం:లింగాల



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 8 (ప్రభాతవార్త) :**

తెలంగాణ రాష్ట్ర నూతన టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఎల్బీనగర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లింగాల నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నూతన పీసీసీ అధ్యక్షుడుగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నియామకం కావడంతో ఆదివారం లింగాల నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు లింగాల అంజన్ కుమార్ గౌడ్, కొత్తపేట కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు లింగాల కిషోర్ గౌడ్ మహేష్ కుమార్ గౌడ్ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో అందరం కలిసి పనిచేస్తామని తెలిపారు.

## ఆర్కే పురం డివిజన్ అల్కాపూరి యూత్ అసోసియేషన్



ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని డివిజన్ మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్ రెడ్డి, టీపీసీసీ సభ్యుడు భాస్కర్ రెడ్డి దంపతులు సందర్శించి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిట్ట సుమతిహరినాథ్ రెడ్డి, పగడాల శ్రీశైలం, తిలక్, కృష్ణ, నగేష్, జావేద్, శ్రీకాంత్, కిట్టు, సంతోష్, లక్ష్మణ్, సాయి, మున్న, అనిల్, శివ, కాలనీ వాసులు పాల్గొన్నారు. - (ఎల్బీనగర్, ప్రభాతవార్త)

# గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



**సైదాబాద్, సెప్టెంబర్ 8 (ప్రభాతవార్త) :**

బి.ఎన్.రెడ్డి డివిజన్ చైతన్య నగర్ కాలనీలో శనివారం గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కాలనీలోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గణనాథుడి మండపాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారి పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గత ఏడాది గణనాథుడి లడ్డూను దక్కించుకున్న రెడ్డి టిఫిన్ సెంటర్ యజమాని కె. కృష్ణారెడ్డి సదరు నగదును కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కె. నరసింహారెడ్డి, చైతన్య నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు టి. జలంధర్ రెడ్డి, సాయిబాబా దేవాలయ కమిటీ అధ్యక్షుడు టి.రాం రెడ్డి, దేవాలయ కోశాధికారి శ్రీనివాస్ గుప్త, ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

**వంజరి వినోద్ కుమార్**



**మలక్‌పేట, సెప్టెంబర్ 8 (ప్రభాతవార్త) :**

ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తెలంగాణ మిర్చి అసోసియేషన్ అధ్యక్షుడు వంజరి వినోద్ కుమార్, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ, మాజీ అధ్యక్షులు దడువై రాఘవేందర్ లు పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి పలువురు వ్యాపారస్తుల తో కలిసి వారు ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగలు సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయన్నారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. దేవాలయంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద ప్రతిరోజు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం కృష్ణ, రమణ, క్యాతం వెంకటేశం, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరుకున్న వ్యాపార సముదాయాలు




**మలక్‌పేట, సెప్టెంబర్ 8 (ప్రభాతవార్త) :**

చంచల్ గూడా లోని మర్కాజి అంజుమన్ ఇ మహదవియా ప్రాంగణంలో ఉన్న పలు వ్యాపార సముదాయాలు శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మర్కాజి అంజుమన్ ఇ మహదవియా భవనంలో దాదాపు 100 సంవత్సరాల నుంచి పలు వ్యాపార సముదాయాలు కొనసాగుతున్నాయని వాటిలో కొన్ని శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారాయని పలువురు పేర్కొన్నారు. గతంలో మలక్ పేట సర్కిల్ కు చెందిన జిహెచ్ఎంసి అధికారులు సదరు వ్యాపార సముదాయాలు శిథిలావస్థకు చేరుకున్నయని గుర్తిస్తూ నోటీసులు జారీ చేయడం జరిగిందని, శిథిలావస్థకు చేరుకున్న వ్యాపార సముదాయాల వల్ల ప్రమాదాల సంభవించే ప్రమాదం ఉందని వెంటనే సదరు వ్యాపార సముదాయాలను కూల్చివేయాలని, లేనిపక్షంలో మరమత్తులు చేయించాలని నోటీసులో పేర్కొనడం జరిగిందని వివరించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శిథిలావస్థకు చేరుకున్న వ్యాపార సముదాయాలు కూలిపోయే ప్రమాదం ఉందని దీంతో ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత జిహెచ్ఎంసి అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

## వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో గణపతి పూజలు




**తుర్కయంజాల్, సెప్టెంబర్ 7 (ప్రభాతవార్త) :**

తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా గణపతి పూజాలు నిర్వహించారు. వడ్డెర వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు నర్రా పాండు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేశ్ ఆదివారం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కలిసిమెలిసి ఉండాలన్నారు. అందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరారు. ఈ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడ ఆ దేవుని కరుణ ప్రతి ఒక్కరిపై చూపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తుర్కయాంజాల్ నాయకులు గండికోట కృష్ణ, నర్ర శ్రీధర్, వేముల మల్లేష్, నర్సింహ్మా, కుంచం అంజయ్య, వేముల బ్రహ్మాం, వేముల వాసు, వరికుప్పల ఆంజనేయులు, ఓర్సు శ్రీను, బోదాసు గిరి, విగ్రహ దాత కుంచం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## మహేష్ కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన మిద్దెల జితేందర్

**సైదాబాద్, సెప్టెంబర్ 7 (ప్రభాతవార్త) :**



తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్ కుమార్ గౌడ్ ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మిద్దెల జితేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం బీసీలకు ప్రాధాన్యత ఇచ్చి మహేష్ కుమార్ గౌడ్ కు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పారా క్రీడాకారులకు అండగా ఉంటాం : మంత్రి సీతక్క



**మలక్‌పేట, సెప్టెంబర్ 8 (ప్రభాతవార్త) :**

పార క్రీడాకారులకు అండగా ఉంటామని వికలాంగులు, వయోవృద్ధులు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. పారా ఒలంపిక్స్‌లో కాంస్య పతాక విజేత జీవన్ జి దీప్తి మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఆమెను శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామన్నారు. జీవంజి దీప్తి వరంగల్ బిడ్డ కావడం సంతోషంగా, గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ ఆఫ్ తెలంగాణ గౌరవ అధ్యక్షుడు, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, సాట్స్ చైర్మన్ శివసేనరెడ్డి, పారా స్పోర్ట్స్ గౌరవ సలహాదారుడు సంజీవయ్య, అధ్యక్షులు సింగారపు బాబు, ప్రధాన కార్యదర్శి గాడి పల్లి ప్రశాంత్, కోచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సాహెబ్ నగర్‌లో భక్తులను ఆకట్టుకుంటున్న భారీ గణనాథుడు

**వనస్థలిపురం, సెప్టెంబర్ 8 (ప్రభాతవార్త) :**



బి.ఎన్. రెడ్డి. నగర్ డివిజన్‌లోని సాహెబ్ నగర్‌లో శ్రీ రామ్ గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన శ్రీ పూరి జగన్నాథ్ 26 అడుగుల భారీ గణనాథుడు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాడు. బి.ఎన్. రెడ్డి.మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న రాం మోహన్ గౌడ్ గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు ముద్దగౌని జగన్ గౌడ్ మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మనీష్ గౌడ్, మానవ గౌడ్, నవీన్ గౌడ్, నరసింహ, గిరి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## లంబోదరుడికి ఘనంగా పూజలు

**హయత్‌నగర్, సెప్టెంబర్ 9 (ప్రభాతవార్త) :**

వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని హయత్ నగర్ డివిసన్‌తో పాటు, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ లోని వార్డులలో ఏకాదంతుడుకి భక్తులు ఘనంగా పూజలను నిర్వహించారు. హయత్ నగర్ లో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాలకు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, సిఐ నాగరాజు గౌడ్ హాజరై వినాయకుడికి పూజలు చేశారు. పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ 9వ వార్డులోని సాయి కుటీర్ గణనాథుడుకి కౌన్సిలర్ మురళీధర్ రెడ్డి పూజలు నిర్వహించారు.

## లంబోదరుడికి ఘనంగా పూజలు



**హయత్‌నగర్, సెప్టెంబర్ 9 (ప్రభాతవార్త) :**

వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని హయత్ నగర్ డివిసన్‌తో పాటు, పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలోని వార్డులలో ఏకాదంతుడుకి భక్తులు ఘనంగా పూజలను నిర్వహించారు. హయత్ నగర్ లో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాలకు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, సిఐ నాగరాజు గౌడ్ హాజరై వినాయకుడికి పూజలు చేశారు. పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ 9వ వార్డులోని సాయి కుటీర్ గణనాథుడుకి కౌన్సిలర్ మురళీధర్ రెడ్డి పూజలు నిర్వహించారు.

## వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి :ఈటల



**మల్కాజిగిరి, సెప్టెంబర్ 8 (ప్రభాతవార్త) :**

వినాయక చవితి పండుగ సందర్భంగా శనివారం మల్కాజ్గిరి వాణి నగర్ లోని శ్రీ విజయ వినాయక స్వామి ఆలయంలో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ప్రత్యేక పూజలు . నిర్వహించారు. వినాయక స్వామి ఆలయం ఈవో వెంకన్న ప్రత్యేక ఆహ్వాన మేరకు వాణి నగర్ విజయ వినాయక స్వామిస్వామి ఆలయంలో ఎంపీ ఈటెల రాజేందర్ వినాయక నగర్ కార్పొరేటర్ కే రాజ్యలక్ష్మి లతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీ ఈటెల మాట్లాడుతూ వినాయక ఉత్సవాలు హిందువులకు ఎంతో పవిత్రమైనవని మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు ప్రశాంతంగా వినాయక ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్ గణేష్ లక్ష్మణ్ ఓం ప్రకాష్ పునీత్ బాలకృష్ణ హారిక తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం

**కార్పొరేటర్ శ్రావణ్**



**మల్కాజిగిరి, సెప్టెంబర్08 (ప్రభాతవార్త) :**

డివిజన్ ప్రజలు సమస్యల బారిన పడకుండా తాను ముందుండి ఆ సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ శ్రావణ్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని బలరాం నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కాలనీ సభ్యులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ముఖ్యంగా హైడ్రా మీద కాలనీ వాసులు భయాన్ని వ్యక్తం చేయగా, శ్రవణ్ హైడ్రా అధికారి రంగనాథ్‌తో మాట్లాడి ఎన్నో యేళ్లుగా ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్న మధ్య తరగతి వారికీ ఇబ్బంది పెట్టమని వారు చెప్పారన్నారు. అంతేకాకుండా సిల్ట్, కరెంట్ పోల్స్ తదితర సమస్యలపైన ఈ. ఈ లక్ష్మణ్, ఏ.డి. ఈ యాదగిరి గారితో చర్చించి సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు రాధా కృష్ణ యాదవ్,గోపాల్ సింగి, సూరజ్ సింగ్, అడ్వాయిట్, క్రాంతి మరియు పెద్ద సంఖ్యలో కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునుగనూర్ లో కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ



**తుర్కయంజాల్, సెప్టెంబర్ 8 (ప్రభాతవార్త) :**

వినాయక చవితి పండుగ సందర్భంగా మునగనూరులోని టెలిఫోన్ కాలనీలో కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ చరణ్ కస్తూరి ఆధ్వర్యం లో శనివారం 1వ వార్డు కౌన్సిలర్ తాళ్లపల్లి సంగీత మోహన్ గుప్తా, మాజీ వార్డు సభ్యులు గుత్త వెంకట్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యుడు, ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరామ్ గార్ల చేతుల మీదుగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ... మట్టి గణపతియే మహా గణపతియని, పర్యావరణ పరిరక్షణకు కస్తూరి ఫౌండేషన్ చేస్తున్న సేవలు మరువలేనివని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పూనుకోవాలని కోరారు. ఫౌండేషన్ చైర్మన్ చరణ్ కస్తూరిని కాలనీవాసులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పున్న చంద్రశేఖర్, ఉదావత్ రవి కుమార్, కురుమూర్తి,బండ నరేందర్ ఉదయ్, కృష్ణ, చంద్రశేఖర్, తులసి రామ్, భగవాన్, అంజి, సునీల్, బాలాజీ, సురేష్, గోవర్ధన్ మహిళలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## లక్ష్మారెడ్డి పాలెం వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

**హయత్ నగర్, సెప్టెంబర్ 8 (ప్రభాతవార్త) :**

పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ పరిధి లక్ష్మారెడ్డి పాలెం వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా సబ్బినేని రామ్మోహన్ రావు అధ్యక్షులుగా భాగన్నగారి గోవిందరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎమ్ డి.మజీద్ బాబా ఉపాధ్యక్షులుగా ఉయ్యాల శివ, నాగరాజు బాలుగురి రాజ్ కుమార్ సెక్రెటరీగా కొండ వినోద రాజు, జాయింట్ సెక్రెటరీగా సంపత్ గౌడ్, కోశాధికారిగా ఉదారి రవీందర్, కార్యవర్గ సభ్యులుగా ఐతగొని అంజయ్య గౌడ్, సతీష్ రెడ్డి జాల చంద్రశేఖర్, శ్రీనాథ్ రెడ్డి శ్యాంసుందర్, కాలె నరసింహ డి.శ్రీనివాసరావు, ఎం.సురేష్ బాబు, జి.శ్రీనివాసరావు వంగూరి యాదగిరి యాదవ్ మోహన్ రావు, వెంకటరెడ్డి ఎన్నికయారు. నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ... అందరి సహకారంతో లక్ష్మారెడ్డి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

## డీసీపీ నల్లబోతు వెంకటరమణ కుటుంబానికి సంతాపం

**తెలంగాణ జెన్కో అడిషనల్ డీసీపీ ప్రతాప్**

**కుషాయిగూడ, సెప్టెంబర్ 8 (ప్రభాతవార్త) :**

నల్లబోతు కృష్ణయ్య సమాజానికి ఎంతో ఆదర్శమని తెలంగాణ రాష్ట్ర జెన్కో విజిలెన్స్ అధికారి, అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రతాప్ పేర్కొన్నారు. అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ నల్లబోతు వెంకటరమణ తండ్రి, ప్రముఖ సంఘ సేవకులు, రైతు సంక్షేమ సంఘం నాయకులు, సామాజిక కార్యకర్త నల్లబోతు కిష్టయ్య మృతి చెందడంతో ఏర్పాటు చేసిన సంతాప



కార్యక్రమంలో పలువురు డిసిపిలు, ఏసీపీలు, నూతన గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మిట్టపల్లి విజయ్ గౌడ్, విశ్వకర్మ ట్రస్ట్ కాప్రా చైర్మన్ కలకొండ బిక్షపతిల ఆధ్వర్యంలో సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, నాయకులు మాజీ ఎంపీటీసీ ముత్యాలు పటేల్, పలుగుల మైసమ్మ ఆలయం కమిటీ చైర్మన్ పలుగుల లింగయ్య పటేల్, బిజెపి రాష్ట్ర నాయకులు సునీల్ చారి, ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ పటేల్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ జెన్కో విజిలెన్స్ అడిషనల్ డీసీపీ ప్రతాప్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో ఆదర్శవంతమైన వ్యక్తిగా పేరుందిన నల్లబోతు కృష్ణయ్య మృతి సమాజానికి తీరని లోటు అని కొనియాడారు. పితృవియోగానికి గురి అయిన అడిషనల్ డీసీపీ వెంకటరమణ కుటుంబాన్ని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బోనాల శ్రీనివాస్, కాప్రా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బొజ్జ రాఘవరెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త శంకర్ బాబు, సాయి తదితరులు పాల్గొన్నారు.